క్లుప్తంగా

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో ప్రధాన పైపులైన్ మరమ్మతులలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు చిట్వేలి ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకుడు

రాయచోటి టౌన్: ఒక మహిళ కోసం ఏక కాలంలో 11 మంది యువకులతో హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు మైనుద్దీన్ రక్తదానం చేయించారు. సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన రమణమ్మ అనే గర్భిణి కాన్పు సమయంలో బిడ్డ చనిపోవడంతో పాటు రక్తం ఎక్కువగా పోవడంతో తల్లి తీవ్ర అనారోగ్యానికి లోనైంది. అంతేకుండా ఆమెకు (ఏ+)రక్తకణాలు అత్యవసరమని వైద్యులు సూచించారు. ఈ విషయం రమణమ్మ బంధువులు మైనుద్దీన్ దృష్టికి తీసుకపోగా ఆయన వెంటనే స్పందించి తన మిత్రులైన అజయ్, ఫరీద్, రాజా, ముఖేష్, ఫయాజ్, నవాజ్, రెడ్డిబాబు, వెంకటేష్, మనోజ్, కోటేశ్వర్‌లతోపాటు ఆయన కూడా రక్తదానం చేసి ఆమె ప్రాణాలను కాపాడాడు. వీరు రక్తదానం చేయడంతో తమ బిడ్డ ఆరోగ్యంగా ఉందని ఆమె బంధువులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీదారులకు అన్నదానం


అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఫిర్యాదులు అందించేందుకు వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ప్రతి సోమవారం అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా భోజనం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే మదనపల్లె వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు హబీబుల్లా ఖాన్ ఆర్థిక సహకారంతో అర్జీదారులకు అన్నదానం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పుల్లంపేట : విద్యార్థులకు సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. టి.కమ్మపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎం.రమణయ్య సుమారు రూ. 3 వేలు విలువచేసే మెటీరియల్స్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, గిరిధర్, హేమలత, ప్రమీలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంటుపై చర్యలు తీసుకోండి

సిద్దవటం : మాధవరం-1 గ్రామ పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటుపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ఉపాధి హామీ కూలీలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంటు తమకు ఉపాధి హామీ పనులు కల్పించడం లేదన్నారు. ప్రతి దానికి డబ్బులు అడుగుతున్నారన్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో అధికారులు తనిఖీలు చేసి సమగ్ర విచారణ జరపాలన్నారు. అనంతరం వారు ఎంపీడీఓ జవహర్‌బాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎంపీడీఓ స్పందిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేయాలని ఉపాధి హామీ ఏపీఓకు ఆదేశించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

యువతకు రోల్‌మోడల్ చే గువేరా


చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : యువతకు రోల్‌మోడల్ చే గువేరా అని రెవల్యూషనరి స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో చే గువేరా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లె సమీపంలో స్థానికుడైన గోపాల్ సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిందితుడిని అదుపులో తీసుకున్నామన్నారు.

పల్లెవాసులకు శ్రీరామరక్ష జగనన్న ఆరోగ్య సురక్ష


రాజంపేట: అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ


రామాపురం: శిబిరానికి తరలివచ్చిన ప్రజలు


నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెలో కంటి వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

నందలూరు (రాజంపేట) : పల్లె ప్రాంతాలలోని ప్రజలకు శ్రీరామరక్షగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తోందని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నల్లతిమ్మయ్యగారిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్పంచ్ గీతల శిరీషా, నరసింహారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవారికి ఆరోగ్యాన్ని అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని, అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార శిబిరాన్ని, వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన మందుల కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, జెడ్పీటీసీ జి.ఉషా, ప్రభుత్వ వైద్యాధికారిణి సృజన, దాదిరెడ్డి నరసారెడ్డి, ఓర్సు శ్రీనివాసులు, పణతల రామచంద్రయ్య, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. సోమవారం చిన్నంపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామంలో సర్వే నిర్వహించి స్పెషలిస్టు వైద్యులచే కార్పొరేట్ వైద్యం ప్రజలకు చికిత్స అందిస్తున్నామన్నారు. అనంతరం ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం, చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించారు. తహసీల్దార్ పుల్లారెడ్డి, వైద్యాధికారులు గురు మహేష్, రాజశేఖర్, విఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

పుల్లంపేట : పేదల ముంగిటకే ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని వైద్యులు సానేశేఖర్, మనోజ్ చంద్రలు తెలిపారు. సోమవారం అప్పరాజుపేట గ్రామ పంచాయతీలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతికి చెందిన స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ ముద్దా రామసుబ్బారెడ్డి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, స్పెషల్ ఆఫీసర్ త్యాగరాజు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం

రామాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీఓ హైదర్‌వలి, వైద్యాధికారి విజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లె సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, మాజీ సర్పంచ్ సుబ్బయ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశలు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు , నాయకులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు


పుల్లంపేట: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రామసుబ్బారెడ్డి

గ్రంథాలయం తనిఖీ

సిద్దవటం : యువతీయువకులు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సోమవారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రకాల వార్తా పత్రికలు, పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో వారి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు పుస్తకాలను చదవడం అలవరుచుకోవాలన్నారు. రోజూ గ్రంథాలయానికి 50 మందికి పైగా వచ్చి పుస్తకాలను, వార్తా పత్రికలను చదివి వెళుతుంటారన్నారు. గ్రంథాలయంలో 16 వేల రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వీటిని చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వండి

పెనగలూరు : మండలంలోని సిద్దవరం పంచాయతీ తిరుమలరాజుపేటలో ఇండ్ల స్థలాల కోసం బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మణి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ప్రభుత్వ స్థలంలో జెండాలు నాటారు. ప్రజలకు స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆర్‌ఐ అక్కడికి వచ్చి వారి సమస్యను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ నియోజకవర్గ అధ్యక్షుడు రేవూరు శంకరయ్య, రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి గుడిసె నరసింహులు, కోడూరు రవి, రైల్వేకోడూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు నరసింహులు, మండల అధ్యక్షులు రేవూరి కృష్ణయ్య, భాస్కర్, లక్ష్మీనారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన పునరావాసం కల్పించండి

ఓబులవారిపల్లె : మంగంపేట, కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల ప్రజలకు మెరుగైన పునరావాస కల్పన, మౌలిక వసతుల ఏర్పాటుపై సోమవారం విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయంలో వీజీ వెంకటరెడ్డితో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంగంపేట ఆర్‌ఆర్-5లో ప్రస్తుతం జరుగుతున్న పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పరిహారం తదితర అంశాలపై ఎండీ వెంకటరెడ్డితో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చర్చించారు. గ్రామ ప్రజలకు అన్ని వసతులతో మోడరన్ కాలనీని ఏర్పాటు చేయాలని ఎండీని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ మిథున్‌రెడ్డితో సమావేశం

రైల్వేకోడూరు : నియోజకవర్గ సమస్యలపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, కొల్లం గంగిరెడ్డిలు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిసి చర్చించారు. పలు అభివృద్ధి పనులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన నిధులు మంజూరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయనకు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పటిష్టతపై ఆయనతో సమావేశమయ్యారు.


ఏపీఎండీసీ ఎండీతో చర్చిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, నాయకులు

10న శిబ్యాలలో సురక్ష వైద్య శిబిరం

రాయచోటి అర్బన్ : రూరల్ మండలంలోని శిబ్యాలలో 10వతేదీ మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిబ్యాల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఈ శిబిరం నిర్వహించబడుతుందన్నారు. శిబిరంలో స్పెషలిస్టు వైద్యనిపుణులు మహేశ్వరరాజు, ఎస్.జి.వెంకట విశ్వనాథ, వైద్యులు శారద, దివ్యరాణి తదితరులు పాల్గొంటారన్నారు. చికిత్స అనంతరం మందులు అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామపరిధిలోని ప్రజలు వైద్యశిబిరానికి హాజరై చికిత్సలు చేయించుకోవాలంటూ కోరారు.

నేడు కట్టావారిపల్లిలో..

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ రావు తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

రాజంపేట టౌన్ : రాజంపేట మున్సిపాలిటీకి 15 చెత్త బండ్లు మంజూరయ్యాయి. మున్సిపాలిటీల్లో పరిశుభ్రత కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలకు దాదాపు ఏడాది క్రితం చెత్త బండ్లను మంజూరుకు చేసింది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల రాజంపేట మున్సిపాలిటీకి చెత్తబండ్లు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వైఎస్సార్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిసి అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం జగన్ వెంటనే రాజంపేట మున్సిపాలిటీకి చెత్తబండ్లు మంజూరుకు చర్యలు తీసుకోవాలని తన వ్యక్తిగత కార్యదర్శిని ఆదేశించారు. ఫలితంగా మున్సిపల్‌శాఖకు చెందిన ఉన్నతాధికారులు చెత్తబండ్లు మంజూరు చేశారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం మరింత మెరుగుపడేందుకు ఈ బండ్లు దోహదపడగలవన్నారు. ఇకపై మున్సిపాలిటీలోని 29 వార్డుల్లో నిత్యం ఎక్కడ కూడా చెత్త నిల్వ లేకుండా ఎత్తివేయిస్తామన్నారు. క్లీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తనవంతు విశేషంగా కృషి చేస్తానని చైర్మన్ తెలిపారు.


మున్సిపాలిటీకి మంజూరైన చెత్తబండ్ల వద్ద చైర్మన్, అధికారులు

పారదర్శకంగా ఉపాధి హామీ తనిఖీలు

ఓబులవారిపల్లె : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులకు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ విజయారావు తెలియజేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులను తనిఖీ చేయడానికి సోషల్ ఆడిట్ జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను నిర్వహించిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 18వ వేడిత సామాజిక తనిఖీలో భాగంగా పదిరోజులపాటు మండలంలో ఒక్కో గ్రామ పంచాయతీకి మూడురోజుల చొప్పున తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయారావు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రామాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడితోపాటు అధిక లాభాలను ఆర్జించవచ్చునని మండల ప్రకృతి వ్యవసాయ కో -ఆర్డినేటర్ సూరం వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన మిరప పైరు, వాటి వల్ల వచ్చే లాభాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా రైతు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చునని, సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా భూమి సారవంతంతోపాటు మొక్కలు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి చీడ పీడ నివారణ నుంచి తట్టుకోగలవని ఆయన అన్నారు. భూమిలో రసాయనాలు బదులు జీవామృతాలను ఉపయోగించి భూమి సారవంతం పెంచాలన్నారు. భూగర్భ జలాలను పెంచడం దేశవాళీ ఆవు మలమూత్రాలతో అధిక లాభాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు అధిక పోషక విలువలతో పాటు మార్కెట్‌లో అధిక గిరాకీ ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టే పంట ఖర్చు కూడా రైతుకు చాలా తక్కువగా ఉంటుందన్నారు. జీవామృతం చల్లడం ద్వారా భూమి సారవంతంతోపాటు వానపాముల సంఖ్య పెరుగుతాయన్నారు. పంటలలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడంతో పంట నాసించే దోమలు బారి నుంచి రక్షించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతు రాజు కాగలరని ఆయన అన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్‌ను మాత్రమే అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నేతలు ఆర్.రవిశంకర్, పల్లం రామచంద్ర, అబ్దుల్ రజాక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్పందనలో జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేయాలని, గ్యారంటీ పెన్షన్ స్కీం అమలును ఉపసంహరించుకోవాలంటూ కోరారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను మాత్రమే అమలు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఓపీఎస్‌ను అమలు చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా కోశాధికారి గోపాల్‌దాస్ రాజశేఖర్, నేతలు పి.రవిశంకర్, ఎం.సి.చంద్రాయుడు, రామాంజనేయులు, టి.వి.రమణ, నాగముని నాయక్, సతీష్‌బాబు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

పెనగలూరు : హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం బస్టాండ్ కూడలిలో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడుతో వెళ్లడం , స్పీకర్లు పెట్టి వాహనాలు నడపరాదన్నారు. అనంతరం ఎస్ఐ వాహనదారులచే ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పెనగలూరు: ప్రజలతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయిస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డి

కొత్తిమీర పంటపై విష ప్రయోగం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన లక్ష్మీదేవమ్మ అనే మహిళా రైతు ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో కొత్తిమీర పంట సాగు చేసింది. రూ.40 వేల దాకా పంట కోసం ధారపోయింది. పంట చేతికి వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పంటకు గడ్డి మందు కొట్టడంతో ఎండిపోయిందని బాధిత మహిళ వాపోయింది. దీంతో రూ.2 లక్షల దాకా నష్టం జరిగిందని బాధిత మహిళ కంట తడి పెట్టింది.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి

గాలివీడు : చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఎస్ఐ వెంకటశివప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, కొత్తవారు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సెలవు రోజులు, పనులపై వెళ్లే వారు, ఇంటికి తాళం వేసి బంధువుల ఇళ్లకు వెళ్లే వారు ముందస్తు సమాచారం పోలీసులకు అందించాలన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, రోడ్డు భద్రతా సూత్రాలను తప్పకుండా వాహనదారులు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటశివకుమార్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


రామాపురం: సౌభాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం


సుబ్బరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : ఇటీవల ఆకేపాటి అమరనాథరెడ్డి ట్రస్టు ద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన వై.సుబ్బరామిరెడ్డికి సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సోమవారం బాలిరెడ్డిపల్లి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సుబ్బరామిరెడ్డిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముక్కా వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, అమర్, సుధాకర్, హేమలత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆకేపాటి ట్రస్టు ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో అవార్డు పొందిన ఆర్.వి.సౌభాగ్యలక్ష్మిని సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములునాయక్, చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె అతిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు.

నివాళి

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలం లేబాక గ్రామ పంచాయతీ జేసీఎస్ సచివాలయ కన్వీనర్ లంకయ్యగారి గంగయ్య (55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, సిద్దవటం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మేడా మధుసూదన్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, మాజీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, అరిగెల సౌమిత్రి, వెంకటసుబ్బారెడ్డి, మేడా విజయశేఖర్ రెడ్డి, లేబాక ఉపసర్పంచ్ నరసయ్య, ఓర్సు శ్రీనివాసులు తదితరులు నివాళి అర్పించారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించండి

లక్కిరెడ్డిపల్లె : పిల్లలలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఎంఈఓ చక్రేనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాలెంగొల్లపల్లిలోని మామిడిగారిపల్లి, చిన్న పోతులపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలు హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన పథక బిల్లులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలువలను తెలియజేస్తూ, వారి విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయం పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ చక్రేనాయక్

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : తమ గ్రామంలో స్మశాన దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె గ్రామం పిట్టలవాండ్లపల్లె ప్రజలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు వినతిపత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబరు 1178, 79లో స్మశానంకు వెళ్లేందుకు మినహాయింపు దారి ఉండేదన్నారు. ఇటీవల కాలంలో కొందరు దారిని ఆక్రమించుకున్నారన్నారు. సమస్యను తహసీల్దార్, ఆర్‌డీఓల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వెంటనే తమరు జోక్యం చేసుకుని రహదారి ఆక్రమణను తొలగింపచేయాలంటూ విన్నవించారు.


సమస్యను చెబుతున్న గ్రామస్తులు

శివాలయంలో పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


పూజలందుకున్న భుజంగేశ్వరుడు